అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిపల్లి గ్రామానికి చెందిన వివాహిత హేమలత (24) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఘన్ పూర్ గ్రామ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం చెరువులో ఆమె మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి రెండేళ్ల పాప ఉంది. ఆమె మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టారు.

అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం 07 జూన్ 2023

బెల్టు షాపులు వేలం వేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-భిక్కనూర్

గ్రామాలలో మద్యం బెల్ట్ షాపులకు వేలం పాట వేస్తే కేసులు నమోదు చేస్తామని దోమకొండ ఎక్సైజ్ సీఐ పోతిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని జంగంపల్లి గ్రామంలో మంగళవారం వీడిసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మద్యం బెల్ట్ షాపుకు వేలంపాట వేసినట్లు సమాచారం అందటంతో ఆయన గ్రామానికి వెళ్లి అక్కడ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో మాట్లాడారు. అనుమతి లేని బెల్ట్ షాపులకు వేలంపాట నిర్వహించరాదని, గ్రామంలో ఎవరు బెల్ట్ షాపు నిర్వహించిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా దొంగ చాటుగా గ్రామాలలో మద్యం అమ్మితే తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు

పారిశ్రామిక పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం

- యువతకు కొత్తగా 24 లక్షల ఉద్యోగాల కల్పన
- కేటీఆర్ కృషితో ఐటీ రంగంలోనూ అద్వితీయ పురోగతి
- తెలంగాణ పారిశ్రామిక ప్రగతి దినోత్సవంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- జిల్లాలో 745 యూనిట్లకు అనుమతి.. 12,854 మందికి ఉపాధి : కలెక్టర్ రాజీవ్‌గాంధీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పరిశ్రమలు నెలకొల్పే వారికి అనుకూలంగా ఉండేలా ప్రభుత్వం టీఎస్-ఐపాస్ ద్వారా సరళీకృత విధానాలను అమలు చేస్తుండడంతో రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి గణనీయంగా వృద్ధి చెందుతోందని, పరిశ్రమల స్థాపనకు తెలంగాణ స్వర్గధామంగా మారిందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో తెలంగాణ పారిశ్రామిక ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ స్వరాష్ట్రంలో గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో పారిశ్రామిక రంగంలో, ఐటీ సెక్టార్లో సాధించిన అద్వితీయ పురోగతి గురించి కళ్ళకు కట్టినట్టు వివరించారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి తెలంగాణ ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా అందిస్తున్న తోడ్పాటు, సులభతరంగా అనుమతుల మంజూరు తదితర అంశాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విశదపర్చారు. ప్రభుత్వ సరళీకృత విధానాలకు ఆకర్షితులై ప్రపంచ దిగ్గజ కంపెనీలు తెలంగాణాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్న వైనాన్ని తెలియజేశారు. పరిశ్రమల ఏర్పాటుకై ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, మౌలిక సదుపాయాల గురించి ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలు వివిధ సందర్భాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ను, ఐ.టీ శాఖ మంత్రి కేటీఆర్‌ను ప్రశంసించిన తీరు వీడియో ప్రదర్శనల ద్వారా మంత్రి వేముల వివరించారు. శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు వరప్రసాద్, తైవాన్ కు చెందిన ప్రపంచ దిగ్గజ కంపెనీ ఫాక్స్ కాన్ సి.ఈ.ఓ, కంపెనీ నిర్వాహకులు దత్తాద్రి, కేరళకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త జాకబ్ తదితరులు చేసిన ప్రశంసాపూర్వక వ్యాఖ్యలతో కూడిన వీడియోలు తెలంగాణ ప్రభుత్వ పనితీరుకు మంత్రి కేటీఆర్ చేస్తున్న కృషిని ఆవిష్కరింపజేశాయి.

తెలంగాణ ఏర్పాటుకు ముందు పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, పవర్ హాలిడేలతో అనేక పరిశ్రమలు మూత బడ్డాయని సమైక్య పాలన నాటి దైన్య స్థితిని మంత్రి వేముల గుర్తు చేశారు.

స్వరాష్ట్ర సాధన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశ్రమలు స్థాపించే వారికి అనుకూలంగా ఉండేలా టీఎస్-ఐపాస్ చట్టం తీసుకువచ్చి ఔత్సాహికులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారని అన్నారు. అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నిర్దిష్ట గడువులోపు అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. నిర్ణీత గడువు లోపు అనుమతులు మంజూరు చేయని అధికారులకు అపరాధ రుసుము విధిస్తూ, నిబంధనలకు లోబడి ఉన్న దరఖాస్తులకు సకాలంలో అనుమతులు వచ్చేలా చూస్తున్నారని అన్నారు. అంతేకాకుండా రోడ్లు, రవాణా వసతిని మెరుగుపరుస్తూ, నీటి సౌకర్యం, 24 గంటల నాణ్యమైన విద్యుత్, శాంతి భద్రతలు నెలకొని ఉండేలా పోలీసింగ్ వ్యవస్థను మెరుగుపర్చడం జరిగిందన్నారు. ఫలితంగా తొమ్మిదేళ్ల స్వల్ప వ్యవధిలోనే తెలంగాణలో మూడు లక్షల కోట్ల పెట్టుబడులతో 20 వేల కంపెనీలు నెలకొల్పబడ్డాయని వివరించారు. తద్వారా 24 లక్షల మందికి కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీలన్నీ తమ ముఖ్య కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయని అన్నారు. 2014లో ఐటీ ఎగుమతులు రూ. 57 వేల కోట్లకు పరిమితమై ఉండగా, ప్రభుత్వ కృషితో ప్రస్తుతం రూ. 2.44 లక్షల కోట్లకు చేరాయని, నాలుగింతలు వృద్ధి చెందాయని మంత్రి వివరించారు. తెలంగాణ ప్రగతి ధ్యేయంగా, యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే అభిమతంతో ఉద్యోగ కల్పనకు ఆస్కారం కలిగిన కంపెనీలను ప్రభుత్వం తన సరళీకృత విధానాల ద్వారా ఆకర్షిస్తోంది అన్నారు. పారిశ్రామిక ప్రగతితో తలసరి ఆదాయం, తలసరి విద్యుత్ వినియోగంలోనూ తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలుస్తోందని హర్షం వెలిబుచ్చారు. జాతీయంగా జీడీపీ తిరోగమనం బాట పట్టగా, తెలంగాణ జీడీపీ 4 శాతం వృద్ధి సాధించిందన్నారు. సేద్యపు రంగానికి సమాంతరంగా ఐ.టీ, పారిశ్రామిక రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని అన్నారు. మిషన్ భగీరథ నదీ జలాల్లో 10 శాతం నీటి నిల్వలను పరిశ్రమలకు అందిస్తోందని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, టీఎస్-ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి వెంటదివెంట అనుమతులు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. జిల్లా స్థాయి కమిటీ ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమావేశమై ఆన్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అనుమతులు అందిస్తుందని తెలిపారు. టీఎస్-ఐపాస్ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు రూ. 800 కోట్ల పైచిలుకు పెట్టుబడితో 745 యూనిట్లకు అనుమతులు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ వివరించారు. తద్వారా 12854 మందికి ఉపాధి లభించిందన్నారు. టీ.ఐడియా పథకం కింద 310 మంది దరఖాస్తుదారులకు రూ. 22 . 03 కోట్ల రాయితీ మంజూరు చేశామన్నారు. టీ-ప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, దివ్యంగులకు రూ. 108.89 కోట్ల రాయితీని అందించామని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులను సన్మానించారు. విశేషంగా సేవలందిస్తున్న మీ-సేవా నిర్వాహకులకు ప్రశాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, నగర మేయర్ నీతూ కిరణ్, రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సమ్మయ్య, వివిధ శాఖల అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- ఏక కాలంలో పలు విభాగాల్లో సోదాలు.. హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం



యూనివర్సిటీలో సోదాలకు వచ్చిన అధికారులు



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలో తెలంగాణ యూనివర్సిటీలో మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు చేపట్టారు. యూనివర్సిటీలో అక్రమాలపై వరుస కథనాలతో పాటు వైస్ ఛాన్సలర్ వర్సెస్ టీయూ పాలక మండలి సభ్యుల మధ్య నువ్వా నేనా అన్న రీతిలో గొడవలు తారాస్థాయికి చేరాయి. ఒకరిపై ఒకరు ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మంగళవారం మధ్యాహ్నం ఏక కాలంలో యూనివర్సిటీలోని పరిపాలన విభాగంతో పాటు ఆర్ట్స్ కాలేజి ఇతర చోట్ల దాడులు నిర్వహించారు. వివిధ విభాగాలలో అధికారులు దాడులు కొనసాగిస్తు అయా కార్యాలయాల్లో ఉన్న వివరాలను, హార్డ్ డిస్కలను స్వాధీనం చేసుకున్నారు.

పరిపాలన విభాగంలో సందర్శించి, కార్యాలయ సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత కొంత కాలంగా యూనివర్సిటీలో అవినీతి చోటు చేసుకుందని, అక్రమ నియామకాలు, అక్రమ లావాదేవీలు జరిగాయని యూనివర్సిటీలోని పలు విద్యార్థి సంఘాల నాయకులు, తెలంగాణ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు ఆరోపణలు చేసి వేంటనే ప్రభుత్వానికి, ఉన్నత విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ లింబాద్రి, ఎసిబి అధికారులు, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ తోపాటు ఇతర శాఖలకు ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వమే రంగంలోకి దిగి యూనివర్సిటీ లో చోటు చేసుకున్న పరిణామాలను సిరియస్ గా తిసుకుని దాడులకు ఆదేశించినట్టు తెలుస్తోంది. 10 మందితో కూడిన అధికారుల బృందం సోదాలు చేపట్టింది. ఎట కార్యాలయం, ఖజానా విభాగం, ఆర్ట్స్ కాలేజ్ బిల్డింగ్‌లో తనిఖీలు చేపట్టి పలువురు అధికారులను విచారించారు.

ఉదయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ గుప్త యూనివర్సిటీకి వచ్చి రెండు గంటల పాటు పారిపలన భవనం లోనే ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాకముందు వెళ్లిపోయారు. రిజిస్ట్రార్ కనకయ్య సైతం తన కార్యాలయానికి వచ్చి కొద్దిసేపటికే తిరిగి వెళ్లిపోయారు. తర్వాత తిరిగి రాకపోవడం గమనార్హం.

ఆయుష్మాన్‌భారత్, ఆరోగ్యశ్రీ అమల్లో తొలి పది స్థానాల్లో జిల్లా ఆస్పత్రి

నవతెలంగాణ-కంఠేశ్వర్



కార్యక్రమానికి హాజరైన ప్రతిమరాజ్

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రి ఎస్పీ సింగ్ బఘెల్, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ అమలు పని తీరుపై హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్నిప్రభుత్వ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ పథకాల అమలు, పనితీరు, వాటికీ సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో మెరుగైన సేవలు అందిస్తున్న ఆస్పత్రుల జాబితా ఎంపిక చేయగా.. అందులో మొదటి పది స్థానాలలో నిజామాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిలిచినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ తెలిపారు.

సాంకేతిక కారణాలతో 14 వరకు పలు రైళ్లు రద్దు



నవతెలంగాణ-కంఠేశ్వర్

సాంకేతిక, మరమ్మతుల కారణంగా దక్షిణమధ్య రైల్వే పలు రైళ్ల రాకపోకలను రద్దు చేసింది. 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేసినట్టు నిజామాబాద్ ఆర్‌పిఎఫ్ సిఐ వివి సుబ్బారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. రద్దైన రైళ్లలో కాచిగూడ-నిజామాబాద్ (07596) ప్యాసింజర్ రైలు, నిజామాబాద్-కాచిగూడ (07593) ప్యాసింజర్ రైలు, నాందేడ్-నిజామాబాద్ (07854), ప్యాసింజర్ రైలు, నిజామాబాద్-నాందేడ్ (07853) ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. దాంతోపాటు ముత్కేడ్ నుండి నిజామాబాద్ కు వచ్చే ట్రైన్ 11409, నిజామాబాద్ నుండి పండర్‌పూర్ 01413 రైలును కూడా రద్దు చేసినట్టు తెలిపారు. కావున ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు.

సంతలో ధరల మోత

- పిరమైన కూరగాయలు



నవతెలంగాణ-ఎడపల్లి

కూరగాయలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సంతకు వెళ్లిన ప్రజలు.. ధరల మోత చూసి ఏం కొనేటట్టు లేము.. ఎం తినే టట్టు లేము అని పెదవి విరుస్తున్నారు. మంగళవారం ఎడపల్లి వారంతపు సంత జరగగా.. కూరగాయలు, ఆకు కూరల ధరలు విపరీతంగా పెరిగాయి. టమాటలు కిలోకి 80 రూపాయలు పలకగా.. వంకాయ బీరకాయ చిక్కుడుకాయ దొండకాయ ఇతర కూరగాయలు సైతం కిలోకు రూ.80 ధర పలికాయి. కుంటి కూర గోంగూర మెంతం కూర ఇతరత్రా ఆకుకూరల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. గత వారం క్రితం సంతలో తక్కువ ధర పలకగా.. ఈ సారి విపరీతంగా పెరగడంతో స్థానికులు ఆందోళన చెందారు. పచ్చి మిరపకాయలు కిలో 80 పలికగడం గమనార్హం. వీటితో పాటు ఉల్లిపాయ ఎల్లిగడ్డలు ధరలు పెరిగాయి. పెట్రో ధరలు పెరగడంతో రవాణా భారంతో పాటు పంటల దిగుబడి తగ్గడంతో ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో ప్రజలు తక్కువ మొత్తంలో కూరగాయలు కొనుగోలు చేశారు..

దళిత యువకుడిపై దాడి

- గుండి గీయించి అవమానం
- కులాంతర వివాహం చేసుకున్నందుకు కక్ష
- ఇందల్‌వాయి మండలం అన్సాన్‌పల్లిలో ఆలస్యంగా వెలుగులోకి
- పలువురిపై అట్రాసిటీ కేసు నమోదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



గుండు గీయించి దాడి చేయడంతో తలకు గాయం

వేరే కులానికి చెందిన అమ్మాయిని పెండ్లి చేసుకున్నందుకు దళిత యువకుడిపై కక్ష గట్టిన పలువురు.. అవకాశం కోసం ఎదురుచూసి దాడి చేశారు. గుండి గీయించి అవమానించి తీవ్రంగా దాడి చేయడంతో బాధితుడు ఆస్పత్రి పాలైయ్యాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం అన్సాన్‌పల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కద్దురం నందు వేరే కులం అమ్మాయిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి యువకుడిపై కక్ష పెంచుకున్నారు. ఇటీవల అమ్మాయిని ఇంటికి తీసుకెళ్లి గుట్టుచప్పుడు కాకుండా వేరే వ్యక్తికి ఇచ్చి పెండ్లి చేసినట్టు సమాచారం. దీంతో యువకుడిపై సైతం దాడి చేసేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల సిగరేట్ తాగి పొరపాటున పడేయడంతో ఓ రైతు గడ్డి వాము దగ్ధమైంది. సదరు రైతు వదిలేసినప్పటికీ పలువురు దీన్నే అవకాశంగా మలుచుకొని దొంగతనాల నిందలు మోపి దళిత యువకుడిపై దాడి చేసి గుండు గీయించారు. దీంతో తీవ్రంగా గాయపడిన యువకుడిని కుటుంబీకులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. గ్రామ కమిటీ సభ్యులు, మరి కొందరు గ్రామస్తులు కలిసి బూతు మాటలు తిడుతూ గుండు గీసి, తీవ్రంగా కొట్టారని బాధితుడు వాపోయారు. ఇంత దారుణంగా గుండు గీసి కొట్టడానికి కారణం ఇతర కులానికి చెందిన అమ్మాయిని ప్రేమ పెళ్లి చేసుకున్నందుకే నాని, తనపై కావాలనే కక్ష గట్టి దళిత వర్గానికి చెందిన వ్యక్తి కాబట్టే అగ్ర కులస్తులు చిత్ర హింసలకు గురి చేసి దారుణంగా కొట్టారని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. తన ఒంటి గాయాలతో పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారణ జరిపి గ్రామానికి చెందిన కొంత మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళితులపై ఆగ్రవర్ణాల దాడులు కొనసాగుతూనే ఉన్నాయని వాపోయారు. దాడికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని కిష్టయ్య , గౌరవధ్యక్షులు పాశంకుమార్ తదితరులు డిమాండ్ చేశారు.

అర్హులు ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

18 ఏళ్ల నిండిన యువతి యువకులు కొత్తగా ఓటు హక్కు కోసం బిఎల్‌ఓల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులకు ఓటర్ల జాబితాల సవరణపై సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాలను బూతు లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేస్తారని తెలిపారు. కుటుంబం మొత్తం ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చూడాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సవరణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

కామారెడ్డి పట్టణంలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును చూశారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సూపర్డెంట్ భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష హాల్‌టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఈనెల 11న జరిగే గ్రూపు -1 పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం పరీక్షల నిర్వహణపై లైజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో 24 మంది అభ్యర్థులు ఉండేవిధంగా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలను ముందుగానే పరిశీలించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని కోరారు. అభ్యర్థులను ఉదయం 8:30 గంటల నుంచి 10:15 నిమిషాల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారని చెప్పారు. అనంతరం పరీక్ష కేంద్రాల గేట్లను మూసివేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, అధికారులు పాల్గొన్నారు.

1.15 కిలోల అల్ప్రాజోలం పట్టివేత



నిందితుడి అరెస్ట్.. అల్ఫాజోలం స్వాధీనం చేసుకున్న అధికారులు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

ఇతర ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని పట్టుకున్నట్టు బాన్సువాడ ఎక్సైజ్ శాఖ సీఐ యాదగిరిరెడ్డి తెలిపారు. అల్ప్రాజోలం మత్తు కోసం కల్లులో కలిపే మత్తు పదార్థాన్ని మెదక్ జిల్లా చిన్న శంకరంపేట్ మండలం బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన గరిగే బాలకృష్ణగౌడ్ కారులో మత్తు మందు తరలిస్తుండగా మంగళవారం హాసన్‌పల్లి చౌరస్తా రోడ్ వద్ద బాన్సువాడ ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. ఇందులో భాగంగా 1.150 కేజీల అల్ప్రాజోలంను కారు ను బాన్సువాడ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. విచారణ చేపట్టగా మెదక్ నుండి ఓ అజ్ఞాత వ్యక్తి ద్వారా కొనుగోలు చేసి ఇతరులకు అధిక ధరకు విక్రయించడానికి 3 లక్షల విలువ గల మత్తు మందు కొనుగోలు చేసినట్లు బాల కృష్ణ ఒప్పుకున్నాడని బాన్సువాడ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్ పెక్టర్ యాదగిరి రెడ్డి తెలిపారు. వీరి నుండి పెద్ద మొత్తంలో మత్తు పదార్థాలను స్వాదీనం చేసుకున్నామని, పట్టుబడ్డ డ్రగ్స్ విలువ దాదాపు మూడు లక్షల రూపాయల విలువ ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై తేజస్విని శ్రీకాంత్ సందీప్ నాగరాజ్ అయుబ్ తదితులున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండల కేంద్రం శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రాజంపేట మండలం ఆరుగొండ గ్రామానికి చెందిన బోయిని నారాయణ ఆయన భార్య బోయిని బాలమని (50) ద్విచక్ర వాహనంపై బోనాల పండుగలో పాల్గొనేందుకు అరగొండ గ్రామం నుంచి లింగంపేట్ మండలం లింగంపేట కుర్దు గ్రామానికి వెళ్లారు. తిగిరి సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఆర్గొండ గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు.తాడ్వాయి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా కుక్కలు వచ్చాయి. కుక్కలను తప్పించడానికి ఒక్కసారిగా నారాయణ బ్రేక్ వేయడంతో వెనుక బైక్‌పై కూర్చున్న భార్య బాలమని కింద పడిపోయింది. ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం స్థానికులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే మెరుగైన వైద్య చికిత్సల కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాదులో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు వారు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

నేడు గడపగడపకి కాంగ్రెస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

గడప గడపకి కాంగ్రెస్ కార్యక్రమం నిజామాబాద్ నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గోల్ హనుమాన్ చౌరస్తా నుండి మొదలు కాబోతుందని నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశ వేణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, సీనియర్ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి సీనియర్ నాయకులతోపాటు కాంగ్రెస్ పార్టీ అన్ని అనుబంధాల సంఘాలు గడపగడపకి కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

8న ఉద్యోగ మేళ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 8న ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పరమేశ్వర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వ అగ్రో టెక్ , వేతనం 18,000 నుండి 25వేలు టీఏ, డీఏ, ఈజ్ ఫే సేల్స్, పర్సనల్ లోన్స్, టాటా క్యాపిటల్ కంపెనీలవారు ఉద్యోగ మేళా నిర్వహిస్తారని పేర్కొన్నారు. వయోపరిమితి 18 నుండి 30 సంవత్సరాల లోపు ఉండాలని, ఆసక్తి గల నిరుద్యోగ యువతి, యువకులు ఉద్యోగ మేళాకు జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్‌లో పాల్గొనాలని తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ చదివి ఉండాలని, జిల్లా ఉపాధి కార్యాలయం, శివాజీ నగర్, నిజామాబాద్ హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 6305743423, 9959456793, సంప్రదించాలని తెలిపారు.

ఊరూరా చెరువుల పండుగకు విస్తృత ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8 న నిర్వహించనున్న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమానికి విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కలెక్టర్ మంగళవారం సాయంత్రం సంబంధిత అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి చోట పండుగ వాతావరణంలో అట్టహాసంగా వేడుకలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపల్ పట్టణాలకు గాను 401 జీపీల పరిధిలో గల చెరువుల వద్ద ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. చెరువులులేని జీపీల ప్రజలను సమీప గ్రామ చెరువుల వద్ద జరిగే పండుగలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువుల పండుగ కార్యక్రమానికి సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఇంచార్జ్‌లను నియమించుకుని, చెరువుల పండుగ విజయవంతం అయ్యేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. మహిళలు, రైతులు, మత్స్యకారులు, వివిధ వర్గాల ప్రజలందరూ పాల్గొనేలా చూడాలని, ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు. డప్పు వాయిద్యాలతో ప్రదర్శన, బోనాలు, బతుకమ్మ, వలల ప్రదర్శన, కట్ట మైసమ్మ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని, చెరువుల ప్రాంగణాలను రంగవల్లులు, పూలతో ఆకట్టుకునే రీతిలో అందంగా ముస్తాబు చేయాలని ఆదేశించారు. ప్రతి చోట లైటింగ్, టెంట్‌లు, మైక్ సిస్టం, తాగునీరు, భోజన వసతి సదుపాయాలను పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. సరిపడా నిధులు అందుబాటులో ఉన్నాయని, ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువుల ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న రాసిన పాటలు ప్లే చేయాలని సూచించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఈ వేడుకలను ప్రారంభించి, రాత్రి 8 గంటల వరకు ముగిసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. చెరువుల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సెల్ కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండగ జరుపనున్నట్లు నిజామాబాద్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అర్.మధుసుధన్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో వెయ్యి మందితో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగు నీటి రంగంలో వచ్చిన మార్పులు, సాధించిన ప్రగతి గురించి వివరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలు బోధన్ నియోజకవర్గంలోని బోధన్ అప్నా ఫంక్షన్ హాల్‌లో 71 గ్రామాలు, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని అంబేద్కర్ భవన్‌లో 4 గ్రామాలు, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం లోని జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలోని గురడిరెడ్డి కల్యాణ మండపంలో 119 గ్రామాలు, ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆర్మూర్‌లోని గుండ్ల చెరువు వద్ద, బాల్కొండ నియోజకవర్గంలోని ముప్కాల్ గ్రామంలో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పంప్‌హౌస్ వద్ద 89 గ్రామాలు, బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం సిద్ధాపూర్ ట్యాంకు వర్క్స్ సైట్ వద్ద 42 గ్రామాల ప్రజలతో మొత్తం 401 చెరువుల వద్ద పండుగ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కానున్నారని తెలిపారు. 8న జరిపే ఊరూరా చెరువుల పండగ కార్యక్రమం జిల్లాలో 401 గ్రామాలలో జరుగుతుందని వివరించారు. చెరువుల వద్దకు డప్పు చప్పుళ్ళు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారులు వలలతో ఊరేగింపుగా వెళ్ళాలని, చెరువు గట్లపై పండగ వాతావరణం కనబడుటకు ముగ్గులు, తోరణాలు అలంకరించుట, బతుకమ్మలు, కోలాటాలు ఆడుటకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. చెరువులు లేని 88 గ్రామాల ప్రజలు పక్క గ్రామవం చెరువు వద్ద పాల్గొనాలని కోరారు. అనంతరం చెరువు గట్లపై నాయకులకు, ప్రజలకు సహపంక్తి భోజనాలు చేసేందకు నిర్ణయించామని పేర్కొన్నారు. నిజామాబాదు జిల్లా నీటి పారుదల శాఖ ద్వారా 2014 నుండి 2022 వరకు మిషన్ కాకతీయ పథకం క్రింద 841 చెరువుల పనులు చేపట్టడం జరిగిందని చీఫ్ ఇంజనీర్ తెలిపారు. దీని వలన వీటి కింద ఉన్న ఆయకట్టు 94,690 ఎకరాలు స్థిరీకరించబడిందని పేర్కొన్నారు. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజక వర్గాలలో మినీ ట్యాంక్ బండ్‌లను నిర్మించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఆర్ఆర్ఆర్ పనుల కింద 58 పనులు చేపట్టగా, 2014 నుండి 47 చెక్ డ్యాంలు నిర్మించినట్లు వెల్లడించారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ ముఖ్య కాలువల, ఉప కాలువల ఆధునీకరణ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-7 ముఖ్య ఉద్దేశ్యము శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ జలాశయం నుండి నీటిని ఎత్తి పోసి జిల్లాల్లో 1.81 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించడానికి ప్యాకేజీ 20, 21, 21ఏ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తద్వారా నిజామాబాద్ జిల్లా ఆయకట్టు 533791 ఎకరాలు సాగులోకి వస్తుందని తెలిపారు. జిల్లాలో జాకోర- చందూర్, మునిపల్లి, ఫతేపూర్ - సుబ్రియాల్-చిట్టాపూర్ ఎత్తి పోతల పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను దిగ్విజయం చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలి


కమ్మర్‌పల్లి : ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సర్పంచ్ సక్కారం అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ... మనమందరం పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. మొక్కలను నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. మనం నాటే మొక్కలు భవిష్యత్తు తరాలకు ప్రాణవాయువును అందిస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని కార్యక్రమానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు సాగర్, పోషన్న, శ్రీధర్, ఎర్రవ్వ, గణేష్, నాయకులు నెల్ల రమేష్, ఆర్.పి. రాజు, బక్కన్న, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ట్రైజం ట్రైనింగ్ సెంటర్ ప్రక్కన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డిపిఎం సెర్ప్ శ్రీనివాస్ జిల్లా సమాఖ్య అధ్యక్షులు విప్లవ కుమారి పాల్గొని విద్యార్థాలకు పర్యావరణం వల్ల కలిగే లాభాలను వివరించారు. మొక్కలునాటి పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. అనంతరం స్టేట్ బ్యాంకు ఆవరణలో మొక్కలను నాటారు. కార్యాక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎస్. శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, రంజిత, నాజీనా, రవి, లక్షణ్, రామకృష్ణ, హౌస్ వైరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంసిపిఐ (యు) రాష్ట్ర కమిటీకి నిజామాబాద్ జిల్లా వాసి ఎన్నిక



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎంసీపీఐ (యూ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నర్సంపేట పట్టణంలో 4,5,6 జూన్2023 తేదీల్లో ప్లీనరీ సమావేశాలు జరిగాయి. ఈ ప్లీనరీలో43 మందిని రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆరుగురు సభ్యులను ఆహ్వానితులుగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా నుంచి ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న మేత్రి రాజశేఖర్‌ని రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మేత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీకి ఎన్నుకున్నందుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గానికి, రాష్ట్ర కమిటీకి ప్రత్యేక విప్లవ ధన్యవాదాలు తెలియచేస్తూ భవిష్యత్తు లో పార్టీ నిర్మాణానికి పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానని అన్నారు.

ఎస్‌డిఎఫ్, సిడిపి నిధులతో గ్రామాల అభివృద్ధి

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 44 కోట్లు ఎస్‌డిఎఫ్, సిడిపి నిధులతో చాలా వరకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించుకోవడం జరిగిందని, ఇంకా ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుందని, ప్రతి గ్రామంలో ఇప్పటివరకు 25 కోట్ల రూపాయలతో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రతి గ్రామ గ్రామాన సిసి రహదారులు, డ్రైనేజీల నిర్మాణం జరిగాయని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం డిచ్ పల్లి మండలం యానంపల్లి గ్రామంలో గంగపుత్ర సంఘానికి రూ.5 లక్షలు, యాదవ సంఘంకు 5 లక్షలు, పద్మశాలి సంఘంకు 2 లక్షల రూపాయల మంజూరు పత్రాలను కులాల సంఘ సభ్యులకు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే, జిల్లా యువ నాయకులు జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, ధర్పల్లి జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్‌తో కలిసి పంపిణీ చేశారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 44 కోట్లు ఎస్‌డిఎఫ్, సిడిపి నిధులతో చాలావరకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించుకోవడం జరిగిందని వివరించారు. ఇప్పటివరకు 25 కోట్ల రూపాయలతో గ్రామాల్లో సిసి రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాలు నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల పోస్ట్ కార్డు ఉద్యమం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు, రాష్ట్రంలోని 12 యూనివర్సిటీ లలో ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కారం కోసం మంగళవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ పోస్ట్ కార్డు ద్వారా సమస్యల పట్ల సీఎం వెంటనే స్పందిస్తారని తాము ఆశిస్తునామని తెలిపారు. సమస్యలతోపాటు కుటుంబాలను సైతం ఆదుకోవాలని పోస్ట్ కార్డు ద్వారా తెలిపామని తెలిపారు. తెలంగాణ జాక్ చైర్మన్, కన్వీనర్ కరుణాకర్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. సమస్యలు పరిష్కారం కాని సందర్భంలో భవిష్యత్తులో వినూత్న కార్యక్రమాలు చేపట్టడానికి అన్ని యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వి దత్తహరిచ డాక్టర్ శరత్, డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ గోపిరాజ్, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ రమ్య, డాక్టర్ జోష్న, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గంగాధర్ రావు, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ సందీప్, డాక్టర్ నరసింహులు, డాక్టర్ రామలింగం, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ బి.ఆర్ నేత, డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ జి శ్రీనివాస్, డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, డాక్టర్ జలంధర్ డాక్టర్ డానియల్, డాక్టర్ రామేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఆనంద్‌తోపాటు కాంట్రాక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నా జీవితం.. నియోజకవర్గ ప్రజలకే అంకితం

- బిజెపి నాయకులు పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్


విజయకేతనం చూపుతున్న రాకేష్‌రెడ్డి, ఎంపీ


వాహనాల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నియోజకవర్గ గడ్డమీద బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమని, ఇకమీదట నా జీవితం నియోజకవర్గ ప్రజలకే అంకితం అని బిజెపి నాయకులు పైడి రాకేష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌తో కలిసి డిచ్‌పల్లి నుండి 500 కార్లతో భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పైడి రాకేష్ రెడ్డి, ఎంపీ అరవింద్‌లను కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న బెదిరింపులు, దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలు ఇకమీదట ఉండబోవని, తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిగా ఆర్మూర్ అసెంబ్లీలో అత్యధిక మెజారిటీతో గెలిపించి బిజెపి ఆది నాయకత్వానికి కానుక ఇస్తానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోనే రాజకీయ చైతన్యానికి మారుపేరైన ఆర్మూర్ నుంచి రాజకీయ మార్పు మొదలవ్వాలని, వచ్చే ఎన్నికలలో బిజెపి గెలుపే ఖాయమని అన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా డిచ్‌పల్లి నుండి మొదలైన వాహన ర్యాలీ ఆర్మూర్ ద్వారా ఆలూరు నుండి డొంకేశ్వర్, నందిపేట్, మాక్లూర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు పైడి సుచరిత రెడ్డి, పల్లె గంగారెడ్డి, అంకాపూర్ సురేష్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, జానకంపేట సంతోష్ రెడ్డి, జివి నరసింహారెడ్డి, నూతల శ్రీనివాస్ రెడ్డి, జెస్సు అనిల్ కుమార్, పెద్దోళ్ల గంగారెడ్డి, బద్దం లింగారెడ్డి, యల్ల రాజ్ కుమార్, పాలెపు రాజు, పెర్కిట్ పసుపుల సాయికుమార్ ,అందాపూర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లోనైనా పెన్షనర్ల సమస్యల పరిష్కరించాలి



నవతెలంగాణ-కంఠేశ్వర్

దశాబ్ది ఉత్సవాలలోనైనా పెన్షనర్ల సమస్యల పరిష్కరించాలని పెన్షనర్లు కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యోగులు, పెన్షనర్లు అగ్ర భాగాన నిలిచి పోరాడారని, కానీ ఈ పది సంవత్సరాల కాలంలో ఎంతో నిర్లక్ష్యానికి గురయ్యారని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆరోపించింది. మంగళవారం నాందేవ్ వాడలోని సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కే రామ్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్ డీఏలను విడుదల చేయడంలో, పే రివిజన్ కమిటీని ఏర్పాటు చేయడంలో, నగదు రహిత వైద్యం అందించటం, మొదటి తారీకునే పెన్షన్ పొందడం, రిటైర్ అయిన రోజునే వారికి రావలసిన ప్రయోజనాలన్నీ ఏక మొత్తంలో అదే రోజున ఇచ్చి గౌరవంగా పంపించాలని చెప్పిన మాటలు నీటి మీద రాసిన రాతల్లా మారాయని వాపోయారు. ఇప్పుడు ఆ ప్రయోజనాల కోసం రిటైర్డ్ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని వారన్నారు. ఈ కుబేర్‌లో బిల్లులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని వారన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్మోహన్, ఈవియల్ నారాయణ, ముత్తారం నరసింహస్వామి, శిర్ప హనుమాన్లు, అందే సాయిలు, రాధా కిషన్, లావు వీరయ్య , ఉషాన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల అందజేత

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని వివిధ గ్రామల చెందిన పలువురు దివ్యాంగులకు యంపిపి ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి చేతుల మీదుగా సదరం సర్టిపికెట్లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో యంపిడిఓ రాజేశ్వర్, ఏపియం కుంట శ్రీనివాస్, సిసి సాయిలు,సొసైటీ చైర్మన్ లు నర్సయ్య, వెంకటేష్, సర్పంచ్‌లు, యంపిటీసిలు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నవతెలంగాణ-ఆర్మూర్


బీఆర్ఏస్‌లో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మంగళవారం మండలంలోని పిప్రి గ్రామానికి చెందినవారు, మాక్లూర్ మండలంలోని డీకంపల్లికి చెందినవారు భారీగా బీఆర్ఎస్ పార్టీలో చేరినారు. ఈ సందర్భంగా అంకాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఇంటింటికి సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, గతంలో పాలించిన ప్రభుత్వాలు ఏ అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. రైతులు, బడుగు, బలహీన, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేశామని, ఇకముందు మరింత చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పిప్రి ఉప సర్పంచ్ ఆశాపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి, ఎంపీటీసీ సామర సురేష్, సుంకం భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు పాడి పశువులు మృతి

నవతెలంగాణ - వేల్పూర్

వేల్పూర్ మండల కేంద్రంలో విద్యుత్ షాక్ తో రెండు పాడి పశువులు మృతి చెందినట్లు పశు వైద్యాధికారి సంతోష్ మంగళవారం తెలిపారు. మండలకేంద్రానికి చెందిన నారాయణకు చెందిన రెండు పాడి పశువులు పంట పొలాల్లో విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందినట్లు చెప్పారు. రెండు పశువుల ఒక లక్ష 80 వేల వరకు ఉంటుందని అన్నారు. ఆయనతోపాటు ట్రాన్స్‌కో ఏఈ యశ్వంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.


మృతిచెందిన గేదెలు

నాటు సారా కేసులో ఒకరి బైండోవర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఇనాయత్‌నగర్ గ్రామానికి చెందిన లంబడి శంకర్ మంగళవారం తహసిల్దార్ సురేష్ ముందు బైండోవర్ చేశారు. లంబడి శంకర్ నాటు సారా విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎక్సైజ్ సిఐ గుండప్ప ఆధ్వర్యంలో ఆయన ఇంటిపై దాడి చేయగా రెండున్నర లీటర్ల నాటు సారా దొరికినట్లు తెలిపారు. వెంటనే నిందితుడు శంకర్‌ను అదుపులోకి తీసుకొని, స్వాధీనం చేసుకున్నారు. రాత్రి కావడంతో వ్యక్తిగత పుచికత్తుపై విడుదల చేసినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. మంగళవారం ఉదయం కమ్మర్‌పల్లి తహసిల్దార్ సురేష్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు. కాగా మరోసారి నాటు సారా విక్రయిస్తు దొరికితే రెండు లక్షల జరిమాను విధించడం జరుగుతుందని నిందితుడు శంకర్ కు తహసిల్దార్ సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు అశోక్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనానికి ఘనపురం దేవేందర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జూన్ 11న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో పాల్గొనాలని ఆహ్వానం అందిందని నిజామాబాద్‌కు చెందిన ఉపాధ్యాయుడు, కవి ఘనపురం దేవేందర్ మంగళవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జూన్ 11న ఉదయం తొమ్మిదిన్నర గంటలకు సాహిత్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో కవితా పఠనం చేయడానికి తనకు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయం నుంచి ఆహ్వానం అందిందని ఆయన తెలిపారు. స్వరాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలంగాణ సాధించిన పురోగమనం గురించి చాటి చెప్పే అవకాశం రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

పీఆర్ రోడ్డును ఆర్‌బీరోడ్డుగా మార్పు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కొలిప్యాక్ గ్రామస్తులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పీఆర్ రోడ్డును ఆర్‌బికి మార్చినందుకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కొలి ప్యాక గ్రామస్తులు మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ కమిటీ సభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్, జగన్‌ను శాలువాతో బొకేతో సన్మానించారు. కార్యక్రమంలో రైతు బంధు మండలాధ్యక్షులు డికొండ శ్రీనివాస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు డిష్ బాలయ్య సొసైటీ ఎక్స్ చైర్మన్ గణేష్ గ్రామ పెద్ద మనుషులు తిరుపతి, దినేష్, మహేందర్, నర్సాగౌడ్, భోజ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు విరిగిపడ్డ చెట్లు

నవతెలంగాణ - వేల్పూర్


రోడ్డుపైనుండి చెట్టుకొమను తొలగింపజేస్తున్న ప్రజాప్రతినిధి

ఈదురుగాలులు వర్షానికి భారీ చెట్లు రోడ్లపై విరిగిపడ్డాయి. ఆర్మూర్ నుండి భీంగల్‌కి వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడడంతో రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వేల్పూర్ సర్పంచ్ తీగల రాధ మోహన్, ఉప సర్పంచ్ పిట్ల సత్యం అధ్వర్యంలో మంగళవారం జేసిబి సహాయంతో తొలగించేశారు. వెంటనే స్పందించి రాకపోకలను పునరుద్దించిన సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ కి వాహనదారులు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు.

ఆరిఫ్ డాన్ హత్య కేసు ఛేదన

● ఆరుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ-ఎడపల్లి

ఈ నెల ఒకటివ తేదీన జరిగిన నిజామాబాద్‌కు చెందిన ఆరీఫ్ డాన్ హత్య కేసును బోధన్ రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ఆరుగురుని అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గతంలో యిబ్బు మర్డర్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అరిఫ్ డాన్‌ను 20 సార్లు పొడిచి హత్య చేశారని, ఈ హత్యకు ఇర్ఫాన్, రిజవాన్, అథిక్, సొహెల్, చోటు, ఫిద్దు సహకరించారని తెలిపారు. పతకం ప్రకారం డిజైర్ కారులో వచ్చి కత్తులతో దాడి చేసి హత్య చేశారని వివరించారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-బోధన్

వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన మొగులాజీ (24) మతిస్థిమితం లేక సోమవారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. ఆయన కుటుంబీకులు బంధువుల ఇండ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దాంతో మంగళవారం బోధన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొగలాజీ ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు పేర్కొన్నారు.

సేవలాల్ మహారాజ్ ఆలయానికి రూ.51వేల విరాళం



సేవలాల్ మహారాజ్ ఆలయానికి విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండలం సుద్దులం తాండలో నూతనంగా నిర్మించబోవు సేవాలాల్ గుడి నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.51వేలు విరాళాన్ని చందూర్ జడ్పీటీసీ, నిజామాబాద్ జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ అంబర్ సింగ్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు షాహిద్, వర్ని మండల అధ్యక్షులు సురేష్ బాబా, ప్రకాష్ బాబా, హనుమంతరావు, కోటగిరి పత్తే భాయ్, సుద్దులం తాండ ప్రజలు పాల్గొన్నారు.

పెద్దశక్కర్గలో గర్భకోశ వ్యాధుల శిబిరం



దూడలకు మందు పంపిణీ చేస్తున్న అధికారి

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పెద్దశక్కర్గ గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యులు డాక్టర్ బండివార్ విజయ్ మాట్లాడుతూ.. గ్రామంలో దూడల ప్రదర్శన, కృత్రిమ గర్భధారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఇలాంటి శిబిరాలను ప్రతి ఒక్క పశువుల దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో సర్పంచ్ బాబురావు పటేల్, ఉప సర్పంచ్ అనిల్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ బసవరాజ్, గోపాలమిత్ర పండరి, పశువులదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శికి మజీద్ కమిటీ సన్మానం




కాసిఫ్‌ను సన్మానిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ రాష్ట్ర సోషల్ సర్వీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ కాసిఫ్‌కు లింగంపేట్ పెద్ద మసీదు కమిటీ సభ్యులు పూలదండ వేసి శాలువా కప్పి సోమవారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ సోషల్ సర్వీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంపేట్ నివాసి, సామాజిక సేవ కార్యకర్త మమ్మద్ కాసిఫ్ కుటుంబ సభ్యులతో ముస్లింల పవిత్రమైన హజ్ యాత్రలో భాగంగా మక్కాకు, మదీనాకు బయలుదేరుతున్నారు. లింగంపేట్ మజీద్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పవిత్ర హజ్ యాత్ర విజయం కావాలని, మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుటుంబ సభ్యులతో హజ్ యాత్రకు బయలు దేరుతున్న వారి కుటుంబ సభ్యులకు అల్లా ఆశీస్సులు ఉండాలని వారు వేడుకున్నారు. పవిత్రమైన హజ్ యాత్రను విజయవంతం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మజిల్ కమిటీ అధ్యక్షులు ఫారుక్, కమిటీ సభ్యులు ఖదీర్, సర్దార్ ఖాన్, వసీం, ఫతియోద్దీన్, ఎజాజ్ ఆజాం తదితరులు పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌కు సన్మానం



సీడీసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పున్న లక్ష్మన్ ఆధ్వర్యంలో సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్యను ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ తనపై నమ్మకం ఉంచి సీడీసీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు రైతులకు అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, ఉపాధ్యక్షులు బాలయ్య, కార్యదర్శి బోయిన్ సత్యం, కోశాధికారి కామిండ్ల నర్సింలు, సహ కార్యదర్శి నాగారపు రాజు, డైరెక్టర్‌లు గరిగే సురేష్, పున్నా రాములు, ముదిరాజ్ సంఘం సభ్యులు, కడారి రమేష్, నాగారపు ఎల్లయ్య పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, పాలకుర్తి శేఖర్, చంద్రం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

● విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత
● స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ విద్యారంగంలో గత పదేళ్లలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుపతి దేవస్థానం వద్ద జిల్లా విద్యాధికారులతో విద్యారంగంపై సమీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 21 రోజుల పాటు విద్యారంగంలోని విజయాలకు సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ నెల 20న నిర్వహించే తెలంగాణ విద్యా దినోత్సవం విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధి లోని 9 మండలాల్లో ఈనెల 20న విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహిం చాలన్నారు. విద్యా దినోత్సవం సందర్భంగా మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా అన్ని హంగులతో నిర్మించిన మైలారం ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించిన అనంతరం బాన్సు వాడ ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు, ఈ బహిరంగ సభలో 2014 నుంచి విద్యాభివృద్ధికి చేసిన నివేదికను వివరించాలని, ప్రాథమిక పాఠశాల నుంచి పీజీ కళాశాల వరకు అన్ని విద్యాసంస్థల్లో సభలు, సమావేశాలను నిర్వహించి విజయాలను వివరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు సకల హంగులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన మన ఊరు-మన బడి కింద సకల వసతులతో ఆధునీకీకరించిన ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యాభివృద్ధికి అత్యధికంగా కృషి చేస్తుందని, తెలంగాణలో అత్యధికంగా గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 26లక్షల మంది విద్యార్థులకు రూ.150 కోట్లు వెచ్చించి ఒక్కో విద్యార్థికి రెండేసి జతల యూనిఫామ్, పుస్తకాలను అందిస్తున్నామని స్పీకర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, బాన్సువాడ మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దళితోద్ధరణకు సీఎం కేసీఆర్ కృషి

● ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-పిట్లం



ప్రొసిడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే

దళితోద్ధరణకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జ్ వద్ద పిట్లం, చిల్లర్గి, గౌరారం అర్హులైన దళిత కుటుంబాల లబ్దిదారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూ అభివృద్ధికి గానూ బోరు, విద్యుత్ కనెక్షన్‌లకు మంజూరైన ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఒక్కో కుటుంబానికి ఒక యూనిట్ కాస్ట్ రూ.పది లక్షలు అందించారన్నారు. భూ పంపిణీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పేద దళిత కుటుంబాలకు భూమి పంపిణీ చేశారన్నారు. ఈ తరహాలోని మండలంలోని చిల్లర్గి గ్రామంలో 4 గురు పేద దళితులకు భూమి పంపిణీ చేశారని తెలిపారు. ఆ భూములను అభివృద్ధి చేసుకునే స్తోమత లేని కారణంగా వారు ఆర్థికంగా నిలబడాలనే సదుద్దేశంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోరు, విద్యుత్ కనెక్షన్ నిమిత్తం 6లక్షల 64వేల 967 రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. గౌరారం గ్రామానికి చెందిన 9 మంది దళిత కుటుంబాలకు భూ అభివృద్ధికి గానూ బోరు, మోటర్‌ల నిమిత్తం 10 లక్షల 16 వేల 226 రూపాయలు మంజూరైనట్టు వివరించారు. మండల కేంద్రమైన పిట్లం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన 7గురు దళిత కుటుంబాల భూ అభివృద్ధి నిమిత్తం బోరు, విద్యుత్ విత్ కనెక్షన్‌ల నిమిత్తం రూ.11లక్షల 85,345 మంజూరైనట్లు తెలిపారు. దీంతో దళిత కుటుంబాలు దినదినాభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వాసవి రమేష్, చిన్నకొడప్‌గల్ సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, పెద్దకొడప్‌గల్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు వేగవంతం చేయాలి

● మార్క్‌ఫెడ్ డీఎం



జొన్నలను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం

నవతెలంగాణ-పిట్లం

జొన్నల కొనుగోలును వేగవంతం చేయాలని మార్క్‌ఫెడ్ డీఎం రంజిత్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తిమ్మానగర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న జొన్న కొనుగోలు కేంద్రాన్ని అగ్రికల్చర్ డివిజన్ ఆఫీసర్ రతన్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొన్నల కొనుగోలులో ఎలాంటి దుమ్ము, పొల్లు, తేమ శాతం లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయకుండా త్వరితగతిన కొనుగోలు నిర్వహించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ సాయిరెడ్డి, నాయకులు పండరి, ఏఈవో ప్రదీప్‌రెడ్డి, సీఈఓ అశోక్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి లక్ష్య అవార్డు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి రాష్ట్ర స్థాయిలో మరో అవార్డు వరించినట్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో లక్ష్య అవార్డ్ 2023 పొందినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఏప్రిల్ 17, 18 నేషనల్ బృందం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారని, అందులో భాగంగా లేబర్ రూమ్‌కు -84శాతం, ఆపరేషన్ థియేటర్‌కు 87శాతంగా హాస్పిటల్‌కు మర్క్స్ ఇచ్చారని తెలిపారు. ఇందులో భాగంగా హాస్పిటల్‌కు లేబర్ రూమ్‌కి 3సంవత్సరాలకు 2లక్షల చొప్పున 6 లక్షలు, ఎంటీకీ రూ.2 లక్షలు సంవత్సరానికి ప్రభుత్వం నుంచి రానున్నాయని అన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి లక్ష్య అవార్డు రావటంతో స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు, హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రాష్ట్ర స్థాయి లో రావటం గర్వ కారణమని కొనియాడారు.

తోటి విద్యార్థికి పూర్వ విద్యార్థుల చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న తోటి విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు నసురుల్లాబాద్ మండలం నెమ్లీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. మండలంలోని కంశేట్‌పల్లి గ్రామనికి చెందిన రహిమ్ పాషా గత కొన్ని రోజులుగా పక్షవాతం రావడంతో అనారోగ్యానికి గురయ్యారు. దీనితో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో పూర్వ 1994-95 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు స్పందించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ధైర్యంగా ఉండాలని తోటి విద్యార్థికి ధైర్యాన్ని ఇచ్చారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. తన తోటి పాఠశాల స్నేహితులు ఇంటికి రావడం, ఆర్థికసాయం చేయడంతో రహీం కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి సేవా భావాన్ని చాటుకుంటున్న 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఆర్థిక సాయం చేసిన వారిలో సంతోష్ గుప్తా, మోహన్‌రెడ్డి, దస్తాగౌడ్, సాయిబాబా, రెడ్డి, రమేష్, కల్లూరు మోహన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

నవతెలంగాణ-విలేకరుల బృందం



ఎల్లారెడ్డి బడిబాట

ఎల్లారెడ్డి : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈవో వెంకటేశం అన్నారు. మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా లక్ష్మపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ శ్రీపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. అనంతరం మండల విద్యాధికారి వేంకటేశం మాట్లాడుతూ బడి బయట పిల్లలను బడిలో చేరాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం దుస్తులు, మధ్యాహ్న భోజనంతో పాటు వారానికి 3గుడ్లతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తారని తెలియజేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ వైట్ రేషన్ కార్డ్ ఉన్న వాళ్లకు స్కాలర్‌షిప్ వస్తాయని తల్లితండ్రులు తమ పిల్లలను ఖచ్చితంగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. తమ పాఠశాలలో అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఉన్నారని, నాణ్యమైన విద్యబోధన అందిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా ముగ్గురు పిల్లలను చేర్చుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికి బడి బాట..

నసురుల్లాబాద్ : బడిబాట కార్యక్రమంలో భాగంగా నసురుల్లాబాద్ మండలంలోని సంగెం, కంశేట్‌పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరాలని కోరారు. ఈ సందర్భంగా సంగెం గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి ఎంపీపీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, భోజనం, అనుభవం గల ఉపాధ్యాయులు ఉంటారని తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఉపాధ్యాయులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రక్రియకు సంబంధించి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యాబోధన జరిగేలా ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఊతమిచ్చేలా ప్రోత్సహిస్తూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. మనఊరు-మనబడి మొదటి విడుతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యుదీకరణ, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం, మరమ్మతులు, శిథిలావస్థలో ఉన్న వాటిలో నూతన గదులు, డైనింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్మాణం, వంట గదులు, ప్రహారీలు నిర్మించడం ద్వారా పూర్తిస్థాయిలో పాఠశాల అభివృద్ధి వైపు దృష్టి సారిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని ఎంపీపీ తెలిపారు.

అన్ని సౌకర్యాలున్నాయి.. ప్రభుత్వ పాఠశాలకు పంపించండి..

వర్ని : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ స్కూల్లో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకుందామని గోవూర్ హైస్కూల్ చైర్మన్ నన్నేసాబ్ అన్నారు. ప్రభుత్వ స్కూల్లో ఇంగ్లీష్ విద్యతోపాటు, యూనిఫాం, నోట్ బుక్‌లు, రుచికరమైన మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మన ఊరు-మన బడి బాటలో భాగంగా మంగళవారం మోస్రా మండలంలోని గోవూర్‌లో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల పేర్లను నమోదు చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేరి తమ డబ్బును వృథా చేసుకోవద్దని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రాజకళ, శుభాంగి, ప్రసన్న లక్ష్మి తదితరులు ఉన్నారు.



వర్ని : గోవూర్‌లో..



నసురుల్లాబాద్ మండలంలో..

తాగునీరు శుద్ధీకరణ ప్లాంట్ ప్రారంభం



శుద్ధీకరణ ప్లాంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని మీసాన్‌పల్లి గ్రామంలో మంగళవారం తాగునీటి శుద్ధికరణ ప్లాంట్‌ను శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం కంకణం కట్టుకున్నానని నియోజకవర్గంలోని సుమారు అన్ని గ్రామాల్లో తాగునీటి శుద్ధికరణ ప్లాంటులను పైడి ఎల్లారెడ్డి తల్లి రాధమ్మ, విట్టల్‌రెడ్డి జ్ఞాపకార్థకంగా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండ్ల రాజ్యలక్ష్మి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంబురాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత సీఎం కేసీఆర్ పాలనలో దేశంలో ఎక్కడా లేనివిధంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తెలంగాణలో ఇంటింటికీ చేరుతున్నాయని నసురుల్లాబాద్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బొమ్మన్ దేవ్‌పల్లి చౌరస్తాలో ఉన్న శ్రీ వేంకటసాయి స్కూల్‌లో 20న నిర్వహిస్తున్న సంక్షేమ సంబురాల స్థలాన్ని పరిశీలించారు. సంక్షేమ అభివృద్ధిలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని, ప్రతి ఒక్కరూ సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మైషగౌడ్, బానుగౌడ్, నర్సింహులు గౌడ్, ఇమ్రాన్, రతన్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మీసేవ నిర్వాహకుడిగా చందుకి ప్రశంసాపత్రం



నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కేంద్రంలోని చందు మీసేవకు ఉత్తమ మీసేవ అవార్డు అందుకున్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జెడ్పి చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు చేతుల మీదుగా అవార్డును మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా చందుకు పలువురు అభినందనలు తెలిపారు.

ఆశ హాస్పిటల్ లో అరుదైన శాస్త్ర చికిత్స



నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ రోడ్‌లో గల ఆశ హాస్పిటల్ వైద్యులు అరుదైన శాస్త్ర చికిత్స చేశారు. దోమకొండకు చెందిన చంద్రం అనే వ్యక్తి (57 సంవత్సరాలు) క్యాన్సర్ గడ్డతో బాధపడుతూ ఆస్పత్రికి రాగా.. ఆపరేషన్ చేసి క్యాన్సర్ కారక కొవ్వు గడ్డలను తీసివేశారు. ఈ సందర్భంగా లాప్రోస్కోపిక్ గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ బాల్ రడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ ధరలకు ఆపరేషన్ చేయడం ఆశ హాస్పిటల్ ప్రత్యేకత అని అన్నారు. నిర్విరామ వైద్య సేవలు అందిస్తున్న వైద్యులకు డాక్టర్ శేఖర్ రెడ్డి తదితరులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వినూత్న ఆవిష్కరణలకు వేదికగా..

నిజామాబాద్ ఐటీ హబ్

- త్వరలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- ప్రత్యక్షంగా 765 మందికి ఉద్యోగ అవకాశాలు
- పరోక్షంగా 4 రేట్లు యువతకి ఉపాధి
- ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త
- పనులు పరిశీలన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రైవేట్ రంగంలో పెట్టుబడుదరులని ఆహ్వానించి యువతకి ఉపాధి కల్పించడమే ప్రథమ లక్ష్యంగా స్టార్టప్ కేంద్రంగా నిజామాబాద్ ఐ టి హబ్ నిర్మించామని, ఐటీ హబ్‌కి ప్రత్యేక బస్సు సౌకర్యం-పరిశీలనలో పోలీస్ ఔట్ పోస్ట్ ఉందని ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు.

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల న్యూ కలెక్టరేట్ రోడ్డులో నిర్మిస్తున్న ఐటీ హబ్ పనులని మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ ఎన్నారై గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేష్ బిగాల విదేశాల్లో పర్యటించి 8 విదేశీ కంపెనీలు నిజామాబాద్ ఐటి హబ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించుకొనేందుకు ప్రభుత్వం తో అవగాహన ఒప్పందం చేసుకుందని తెలిపారు. సరికొత్త ఆలోచనలతో వచ్చే వారిని ఇన్వెస్టర్ గా మార్చడమే లక్ష్యమని అన్నారు.

గతంలో భూమిపూజ చేసి పనులను ప్రారంభించిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ త్వరలో ప్రారంభించనున్నారని చెప్పారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయాలని ఐటి శాఖ మంత్రి వర్యులు కేటీఆర్ సంకల్పించి నిజామాబాద్ యువతకు ఉపాధి కల్పించాలని, వారిలో ఉన్న సరి కొత్త ఆలోచనలకు ఐటీ హబ్‌లు వేదికగా మారి ఇన్వెస్టర్‌గా మార్చి మరింత మందికి ఉపాధి కల్పించాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్ష అని అన్నారు. తన సోదరుడు మహేష్ బిగాల మంత్రి కేటీఆర్‌తో కలసి అమెరికా ఇతర దేశాల్లో పర్యటించి 8 విదేశీ కంపెనీలతో ఐటీహబ్ లో పనిచేయడానికి ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుందని చెప్పారు. ఐటీ అంటే హైదరాబాద్, బెంగుళూర్ కాకుండా తెలంగాణలోనే ద్వితీయ శ్రేణి నగరాలలో ఒకటైన నిజామాబాద్ గుర్తుకు వచ్చేలా మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు. అతి త్వరలోనే ఐటి హబ్ ని మంత్రి కేటీఆర్ ప్రారంభించి స్థానిక యువతకి విస్తృతమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నేడు అర్గుల్‌లో సాగునీటి దినోత్సవం

విజయవంతం చేయాలి ఎంపీపీ కుంచాల విమల



మాట్లాడుతున్న ఎంపీపీ విమల

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కుంచాల విమల అన్నారు. సాగునీటి దినోత్సవానికి ముఖ్య అతిథిగా ముఖ్య అతిథులుగా టీఎస్ ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఈనెల 7న బుధవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ సాగునీటి దినోత్సవం జిల్లా గురడి రెడ్డి కల్యాణ మండపం అర్గుల్ గ్రామం, జక్రాన్ పల్లి మండలంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపీపీ, జడ్పిటిసి, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, రైతు సమన్వయ కమిటీల మండల ప్రెసిడెంట్లు, కో ఆప్షన్ మెంబర్లు, వీడీసీ సభ్యులు, ఐకెపి సభ్యులకు, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

సామూహిక శ్రీమంతాలు



సీమంతాలు చేస్తున్న టీచర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం సెక్టార్ సూపర్వైజర్ వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు క్రమం తప్పకుండా ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహా మేరకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేసుకోవాలని, హిమోగ్లోబిన్ అధికంగా ఉండే క్యారెట్, బీట్‌రూట్, కోడిగుడ్డు, ఆకుకూరలు తదితర ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రాణి, గంగుబాయి, శ్యామల, కవిత, సరోజ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో బడిబాట

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న పదిమంది విద్యార్థులను బడిలో చేర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం అశోక్, టీచర్లు పనిశ్రీ , గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- ఉపాధ్యాయులకు సన్మానం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు ప్రాజెక్ట్ గ్రామంలో 2004-05లో పదవ తరగతి చదివిన విద్యార్థులు 78 మంది మంగళవారం కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డ ఆనాటి మిత్రులు కలుసుకుని సంతోషంతో గడిపారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన పంతుళ్ళను పిలిచి వారికి పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అందులో కొందరు ఉద్యోగాల రిత్యా స్థిరపడిన వారు ఉంటే మరికొందరు సొంతవ్యాపారాల్లో స్థిరపడి హాయిగా జీవనం కొనసాగిస్తున్నారు. ఎరా మామ బాగున్నావా.. ఏంచేస్తున్నావ్.. అంటూ ఆప్యాయంగా పలకరించుకొని రోజంతా చిన్ననాటి మిత్రులతో గడిపారు. కార్యక్రమంలో జగన్, అనిల్, సుబ్బారాయుడు, రాజశేఖర్, మహేష్, గదారి శేఖర్, పృథ్విరాజ్, సురేష్, రాజాగాంగన్న, జంగం సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నాలాల పూడిక తీత పనులు వేగవంతం చేయాలి

- మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్
- మున్సిపల్ అధికారులతో సమీక్షా

నవతెలంగాణ-కంఠేశ్వర్

వర్షాకాల దృష్ట్యా చేపట్టే నాలాల పూడిక తీసే పనుల పురోగతిని వేగవంతం చేయాలని వర్షాల వల్ల ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ సూచించారు. మున్సిపల్ అధికారులతో మేయర్ తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇంజనీరింగ్, రెవెన్యూ, పారిశుధ్య, అధికారులతో నిర్వహించిన సమీక్షలో నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. సమావేశంలో పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతూ వర్షాల కాలం దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున డ్రైనేజీలను విధిగా శుభ్రం చేసి దోమలు నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సు లలో నిర్లక్ష్యం వహించకుండా విధిగా వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఆదికారులు, రెవిన్యూ అధికారులు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్పీకర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఈ నెల 8,9,10వ తేదీల్లో జరిగే ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్‌లను మంగళవారం రాష్ట్ర శాసనసభాపతి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. చేపలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గోవర్ధన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దిన్, అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, వెంకటేష్ దోత్రే, జిల్లా మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

క్విజ్ కాంపిటీషన్ కోసం

రిజిస్ట్రేషన్ చేసుకోండి

- ఎన్ఎస్‌యుఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొల్పే దిశగా జూన్ 18న నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌కోసం నిజామాబాద్ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోగల యువతీ, యువకులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎన్ఎస్‌యుఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని నిషిత డిగ్రీ పీజీ కళాశాలలోని విద్యార్థులను కలిసి రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ వివరాలను తెలిపారు. దగ్గరుండి విద్యార్థులతో ఆన్లైన్ క్విజ్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా వేణు రాజ్ మాట్లాడుతూ.. పోటీలో పాల్గొనాలనుకునే అభ్యర్థులు ముందుగా 7661899899 గల నెంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ వెబ్ లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్‌ను పొందుతారని, ఆ లింకు ద్వారా వారి వివరాలను 0083 అని రిఫరల్ కోడ్ ద్వారా జూన్ 17 వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలో పాల్గొ న్న అభ్యర్థులకు ప్రతి అసెంబ్లీ నియో జకవర్గానికి ప్రథమ బహుమతి ల్యాప్ టాప్, ద్వితీయ బహుమతి స్మార్ట్ ఫోన్, తృతీయ బహుమతి ట్యాబ్ లెట్‌తోపాటు ప్రతి నియోజకవర్గంలో 40 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రోత్సాహక బహుమతులలో 10 స్మార్ట్ వాచ్లు, 10 ఇయర్ పాడ్లు, 10 హార్డ్ డ్రైవ్‌లు, 10 పవర్ బ్యాంకులు బహూకరిస్తారని పేర్కొ న్నారు. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలోని మహిళా టాపర్లకు ప్రత్యేక బహుమతులు ఎలక్ట్రిక్ స్కూటర్లను బహుకరిస్తారని చెప్పారు. ఈబహుమతి సోనియా గాంధీ చేతుల మీదుగా హైదరాబాదులో ప్రదానం చేస్తారని ఆయన తెలియజేశారు. ఈ క్విజ్ కాంపిటీషన్ 60 నిమిషాల్లో 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వవలసి ఉంటుందని, అంశాలన్నీ కూడా భారతదేశ భౌగోళిక ,చరిత్ర, స్వాతంత్ర ఉద్యమం, తెలంగాణ సాంస్కృతి, చరిత్ర, సామాజిక ఉద్యమాల తోపాటు జనరల్ నాలెడ్జ్ కరెంట్ అఫైర్స్ మరియు అర్థమెటిక్ రీజనింగ్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయని ఆయన తెలిపారు. 16 నుండి 35 సంవత్సరాలుగల వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 8142903456 మరియు 8142803456 నెంబర్లకు కాల్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకులు రమేష్ చంద్ర సందీప్ రెడ్డి, సాగర్, కళాశాల విద్యార్థులు నితన్, దీక్షిత్ , రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థిని, విద్యార్థులకు నిజామాబాద్ నగరంలోని వినాయకనగర్ ప్రాంతంలోని రిలయన్స్ ట్రెండ్స్ షాపింగ్ మాల్ నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు. మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్ర మంలో స్టోర్ మేనేజర్ అనంతరాములు, డిపార్టుమెంట్ మేనేజర్ జగదీష్ మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల ఉత్తమ బోధనకు తోడు అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉత్తమ ఫలితాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో తమ అనుబంధాలను పంచుకున్నారు. ప్రతిభ చాటిన 30 మంది విద్యార్థులకు రిలయన్స్ ట్రెండ్స్ ప్రశంసా పత్రాలను, మెడల్స్ ను అందించి, షాపింగ్ కూపన్స్ బహుకరించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు, రిలయన్స్ ట్రేండ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షాళన చేయండి

- విద్యాశాఖ మంత్రికి ఏఐఎస్ఎఫ్ వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షాళన చేయండి అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ... యూనివర్సిటీలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు తెలంగాణ యూనివర్సిటీ ప్రతిష్టను దెబ్బ తీసేలా ఉన్నాయన్నారు. యూనివర్సిటీ వీసీ ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలు, యూనివర్సిటీ భవిష్యత్తును ప్రమాదకరంగా మార్చిందన్నారు. రిజిస్టర్ నియామకంలో తన మాటే చెల్లుబాటు కావాలనే దుర్బుద్ధితో, ఈసీ నిర్ణయాలను సైతం లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తన అవినీతి, అక్రమాలకు వంతుపాడే వారిని రిజిస్టర్ లుగా నియమించుకొని వీసీ రవీందర్ గుప్తా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీలో తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న, తెలంగాణ యూనివర్సిటీని వెంటనే ప్రక్షాళన చేయాలని, సమాజంలో యూనివర్సిటీపై ఉన్న నమ్మకాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలి వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రైమాన్ పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

నవతెలంగాణ-భీంగల్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మోతె భూమన్నపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘల నాయకులు మంగళవారం ఎస్ఐ రాజ్‌భరత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. బహ్రెయిన్‌లో ఉంటున్న భూమన్న అంబేద్కర్‌తో పాటు దళిత సంఘాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఆయన పై చర్యలు తీసుకోవాలని అధ్యక్షుడు గడాల ప్రసాద్ కోరారు. వినతిపత్రం అందించినవారిలో ఉపాధ్యక్షులు రవీంధర్, మేకల శ్రీనివాస్, దళిత సంఘల నాయకులు సంజీవ్, రాములు, భూమేశ్వర్, రాజేంధర్, నందు, రాంపాల్, తదితరులున్నారు

సీఐ రామన్‌కు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా సురక్ష దినోత్సవం సందర్భంగా ప్రజలకు సేవలు అందిస్తున్న సదాశివనగర్ సిఐ రామన్‌ను స్పీకర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో పలువురు ఆయనను అభినంధించారు. సిఐ రామన్ ను భూంపల్లి గ్రామం దళిత నాయకుడు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజరత్నం మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలందించిన సిఐ రామన్ కి ప్రశంసా పత్రం అందుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో భూంపల్లి మాజీ సర్పంచ్ రాజరత్నం, గైని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS, AT:ADILABAD
ARB. NO: 423 / 2022

Between:-
Srinidhi Chits (Hyderabad)Pvt.Ltd., Represented by its Foreman **Sri Mekala Lakshmi Narayana**, S/o. Laxman, Age: 40 years, R/o Adilabad.
..............Disputant
// AND / /
Y. MURTHY & Others
.... Opponents

O.P;NO:1.Yemula Murthy, S/o: Janardhan, Age: 31 Years, Occu: Business, Madhava textails, Nizamabad, R/o: H.No. 10-10-176/1, Gajulpet, Nizamabad.

O.P NO: 3. Ganji Ganesh, S/o: Rajalingam, Age: 59 Years, Occu: Conductor, Staff No; 675793, O/o. T.S.R.T.C. Nizamabad-II Depot., R/o: H.No. 6-18-170, New NGO's colony, Nizamabad.

O.P; NO: 4. Manpoor Soordas, S/o: Chinnaiah, Age: 46 Years, Occu: Conductor, Staff No; 676799, O/o. T.S.R.T.C. Nizamabad-II Depot., R/o: H.No. 1-162/6A, Sriram Nagar colonyn Nandipet, Nizamabad.

TO

Take Notice that the above dispute is filed against you and others for recovery of money,summon we issued on you, but you failed to received the same.The above dispute is **Posted on:24-06-2023.** for your appearance. On that day you have you appear in person at 11.00A.M.Before the deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

sd/-
Chit Arbitrator
Deputy Registrar OfChits,Adilabad.